రోడ్లకు మహర్దశ

- సుజాతనగర్–సీ–2జోన్ పార్కు వరకు రూ.2.99 కోట్లతో రహదారి
- రూ.1.98 కోట్లతో పెందుర్తి–పులగానివానిపాలెం రోడ్డు నిర్మాణం
- తీరిన 15 ఏళ్ల కల
- జీవీఎంసీ 96, 97వ వార్డుల్లో సుందరంగా ప్రధాన రోడ్లు



కళకళలాడుతున్న సుజాతనగర్ ప్రధాన రోడ్డు

పెందుర్తి: జీవీఎంసీ విలీన ప్రాంతాలు ప్రగతి బాట పట్టాయి. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలు పరిష్కారానికి నోచుకున్నాయి. ముఖ్యంగా ప్రజలకు ఎంతో అవసరమైన రహదారుల నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారించి ప్రజల కష్టాలకు చెక్ పెట్టింది. పెందుర్తి నియోజకవర్గంలో ఇప్పటికే ప్రధాన రహదారుల నిర్మాణం/మరమ్మతుల పనులు చాలా వరకు పూర్తయ్యాయి. ఈ క్రమంలో జీవీఎంసీ 96, 97వ వార్డులో ఎంతో ప్రాధాన్యం కలిగిన రోడ్లను ప్రభుత్వం నిర్మించింది. దాదాపు పుష్కర కాలంగా అభివృద్ధికి నోచుకోని సుజాతనగర్ బీఆర్‌టీఎస్ రహదారి నుంచి సీ–2 జోన్ వరకు ఉన్న రోడ్డు, దాదాపు రెండు దశాబ్దాలుగా ప్రజలకు కలగా ఉన్న పెందుర్తి బీఆర్‌టీఎస్ రహదారి నుంచి పులగానివానిపాలెం రోడ్డు అత్యంత సుందరంగా మారాయి. 15వ ఆర్థిక సంఘం నిధులతో..

15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు కావడంతో పెందుర్తి నియోజకవర్గానికి దాదాపు రూ.2.99 కోట్లు కేటాయింపు జరిగింది. ఆయా నిధులను సుజాతనగర్ రోడ్డు అభివృద్ధికి వెచ్చించారు. అలాగే పెందుర్తి బీఆర్‌టీఎస్ రహదారి–పులగానివానిపాలెం రోడ్డుకు రూ.1.98 కోట్లు నిధులను జీవీఎంసీ నుంచి కేటాంచి పనులు పూర్తి చేశారు. ఇప్పుడు ఆయా రోడ్లపై ప్రజలు హాయిగా ప్రయాణం సాగిస్తున్నారు.

> సుజాతనగర్ ముఖ ద్వారం నుంచి సీ–2 జోన్ వరకు దాదాపు 15 కాలనీల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. కానీ రోడ్డు పూర్తిగా గోతులమయం కావడంతో ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవాళ్లం. పదేళ్లుగా ఈ నరకాన్ని చూశాం. కానీ ఇటీవల రోడ్డును అభివృద్ధి చేశారు. ఇప్పుడు ఎలాంటి ఇబ్బంది లేకుండా రాకపోకలు సాగిస్తున్నాం' సుజాతనగర్ వాసి శేఖర్ అభిమతం.

> పెందుర్తి పాత ప్రభుత్వాస్పత్రి నుంచి పులగానివానిపాలెం వెళ్లాలంటే ఎనరకం చూసేవాళ్లం. ఓ వైపు వాహనాల రద్దీ..మరో వైపు ఇరుకు రోడ్డు. రోడ్డు నిండా గోతులు. ఇలా చాలా అవస్థలు పడేవాళ్లం. అయితే ఏడాది కిందట మా సమస్యను సీఎం వైఎస్ జగన్ తెలుసుకుని వెంటనే రోడ్డుకు జీవీఎంసీ ద్వారా నిధులు విడుదల చేశారు. ఇప్పుడు రోడ్డు వెడల్పు అయ్యి చాలా సౌకర్యవంతంగా ప్రయాణం చేస్తున్నాం' సూర్యనగర్‌కు చెందిన శివ ఆనందం ఇది.

నెరవేరిన కల : సుజాతనగర్–సీ–2 జోన్, పెందుర్తి–పులగానివానిపాలెం రహదారుల సమస్య పంచాయతీ కాలం నుంచీ ఉంది. ఆయా రోడ్లు వేయాలని ప్రజలు ఎన్నోఏళ్లుగా కోరుతున్నారు. ఈ క్రమంలో 2014 నుంచి 2019 వరకు అప్పటి ప్రభుత్వం రహదారుల నిర్మాణంపై దృష్టి సారించలేదు. అయితే 2019 తర్వాత ప్రభుత్వం పెందుర్తి–పులగానిపాలెం, సుజాతనగర్ రోడ్లపై దృష్టి పెట్టింది. ఈ క్రమంలో 15వ ఆర్థిక సంఘం నిధులు, జీవీఎంసీ నిధులు కలిపి రూ.1.98 కోట్లు పులగానిపాలెం రోడ్డుకు, రూ.2.99 కోట్లు సుజాతనగర్ రోడ్డుకు కేటాయించింది. 2023 ప్రారంభంలో రోడ్డు పనులకు శ్రీకారం చుట్టి ఏడాది తిరగకుండానే ఆయా రోడ్ల నిర్మాణం పూర్తి చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎంతో ఉపయోగం : పెందుర్తి ప్రాంతంలో కీలకమైన సుజాతనగర్‌లో ఈ రహదారి నిర్మాణం వేలాది మందికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ మార్గంలో గుండా దాదాపు 15 కాలనీల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో దాదాపు 1.5 కిలోమీటర్ల పొడవున్న ఈ ఇరుకు రోడ్డును 40 అడుగుల మేర విస్తరించారు. మరో వైపు పెందుర్తి పట్టణంలో అత్యంత కీలకమైంది పెందుర్తి–పులగానివానిపాలెం రోడ్డు. ఈ మార్గంలో ప్రశాంతినగర్, పులగానివానిపాలెం, సూర్యనగర్, నల్లక్వారీ, నరవవానిపాలెం, మహాలక్ష్మినగర్, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, మొండిబంద వాసులతో పాటు పెందుర్తి మండలం జుత్తాడకు ఇదే మార్గం. దీంతో పాటు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు ప్రధాన రోడ్డు ఇదే. ఈ క్రమంలో 30 అగుడులుగా ఉన్న ఈ రోడ్డును 40 అడుగుల మేర విస్తరించడంతో తమ కష్టాలకు చెల్లుచీటి పడిందని ఆయా ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సుజాతనగర్ ముఖద్వారం వద్ద సుందరంగా రోడ్డు



విస్తరించిన పులగానివానిపాలెం రోడ్డు



ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద సుందరంగా పులగానివానిపాలెం రోడ్డు

క్లుప్తంగా

సుబ్రహ్మణ్యస్వామికి విశేష అభిషేకాలు



విశేష అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీ దేవ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు జరిగాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు తరలి వచ్చి స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

ఘనంగా లక్ష్మీదేవి పూజలు



అమ్మవారికి పూజ చేస్తున్న అర్చకుడు

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై పాల్గుణ పక్షోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీమహాలక్ష్మి అమ్మవారికి శ్రీసూక్త పారాయణం, ప్రత్యేక పూజలు జరిపారు. లక్ష్మీ హవనం, కుంకుమ పూజలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

కల్యాణం.. కమనీయం



తలంబ్రాలు ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

15 మద్యం సీసాల స్వాధీనం

పరవాడ: మండలంలోని పెదముషిడివాడ గ్రామానికి చెందిన జెన్నారపు త్రినాథ్ మద్యం దుకాణం నుంచి 15 మద్యం సీసాలు (180 ఎంఎల్) కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తుండగా ఎస్ఐ టి.మల్లేశ్వరరావు దాడి చేసి అతన్ని పట్టుకున్నారు. త్రినాథ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

మహిళను వేధించిన కేసులో ఇద్దరికి జైలు, జరిమానా

సబ్బవరం: భార్యను వేధించిన కేసులో అనకాపల్లి 7వ ఎంఎం కోర్టు జడ్జి బీవీవీ విజయలక్ష్మి బాధితురాలి భర్త, మరిదికి జైలు శిక్షతో పాటు జరిమానా విధించారు. స్థానిక సీఐ పిన్నింటి రమణ మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బోదివలస గ్రామానికి చెందిన నేబర్తి త్రివేణి తనను భర్త నేబర్తి శ్రీను,మరిది నేబర్తి రమేష్, ఆడపడుచు పద్మ వేధిస్తున్నారని 2020 జూలై 7న స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టి చార్జిషీట్ ఫైల్ చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మృణాళిని వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయిలకు జడ్జి విజయలక్ష్మి నేబర్తి శ్రీనుకు ఏడాది జైలుతో పాటు రూ. 5 వేల జరిమానా, మరిది రమేష్‌కు నెల రోజులు జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించినట్టు సీఐ తెలిపారు.

వెంకన్న ఆలయంలో పండిత సదస్యం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పండిత సదస్యం నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు భావ నారాయణ స్వామి, హరి నారాయణ స్వామి నేతృత్వంలో వేకువజామున స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. సింహాచలానికి చెందిన రుత్వికుల ఆధ్వర్యంలో నిర్వహించిన పండిత సదస్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన రుత్వికులు పాల్గొన్నారు. బుధవారం సాయంత్రం ఆలయంలో లక్ష తులసి పూజ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

సింహగిరిపై విశేషంగా హోమం



ప్రధాన కలశంతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు



సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులు

సింహాచలం: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై గంగధార సమీపంలోని ప్రాచీన రామాలయంలో మంగళవారం హోమం విశేషంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని మండపంలో సీతరామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తులను అధిష్టంపజేశారు. హోమ గుండం వద్ద విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, కలశారాధన, అగ్నిప్రతిష్ట, హోమం, పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు.అనంతరం కుంభప్రోక్షణ జరిపారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని ఆలయ అర్చకుడు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామివారి మూలవిరాట్‌కు సమర్పించారు. అర్చకులు చిన్నా తదితరులు హోమం నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి సతీసమేతంగా కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



క్రీడాకారులను అభినందించిన ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

పరవాడ: రాష్ట్ర బేస్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లాలో నిర్వహించిన 31వ జూనియర్ నేషనల్ బేస్ బాల్ చాంపియన్‌షిప్‌కు పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో 11 తరగతి చదువుతున్న ఏవీ శశాంక వర్మ, కె.ధీరజ్‌సాయిరామ్ ఎంపికయ్యారని పాఠశాల స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబు చెప్పారు. పంజాబ్ రాష్ట్రంలో మే 22 నుంచి 26 వరకు జరిగే జాతీయ స్థాయి బేస్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఇద్దరు అర్హత సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కోచ్ బి.రాజేష్‌కుమార్, పాఠశాల సీఈవో నిశాంత్ పాల్గొన్నారు.

'పది' పరీక్ష కేంద్రాల పరిశీలన

డీఎస్పీ సత్యనారాయణ



సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలపరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

సబ్బవరం: పదోతరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్టు పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ తెలిపారు. మండల కేంద్రంలోని సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల,ప్రతిభా విద్యాలయంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను ఆయన సందర్శించి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అప్రమత్తంగా వ్యవహరించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. జిల్లా ఎస్పీ మురళీ కృష్ణ ఆదేశాల మేరకు మాల్ ప్రాక్టీస్ జరగకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట సీఐ పిన్నింటి రమణ తదితరులు ఉన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాల్సిందే..

ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో రాజకీయ పార్టీలు నిబంధనలకు లోబడి నడుచుకోవాలని డీఎస్పీ సత్యనారాయణ కోరారు. పెందుర్తి,యలమంచిలి నియోజకవర్గాల పరిధిలోని ఎన్నికల నిబంధనలు మీరకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. మీటింగ్‌లు, ఊరేగింపులతో పాటు మైక్ పరిమిషన్,లౌడ్ స్పీకర్లకు అనుమతులు కావాలంటే జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి లేదా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతులు తీసుకోవాలని తెలిపారు.సింగిల్ విండో సిస్టంలో అనుమతులు లభిస్తాయని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.

ఘనంగా జువ్వమాంబ పండగ



జువ్వమాంబను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, నాయకులు

పరవాడ: కస్నూరు శివారు మడకపాలెంలో కొలువుదీరిన జువ్వమాంబ అమ్మవారి పండగను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి కృష్ణవేణి, ఎంపీటీసీ గొల్లవిల్లి శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ను గ్రామ సర్పంచ్ కృష్ణవేణి, ఎంపీటీసీ శ్రీనివాసరావు, పీఏసీఎస్ డైరెక్టర్ మడక సూరిబాబు శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, పార్టీ నాయకులు పైల అప్పలనాయుడు, మడక అప్పారావు, మడక దారరాజు, మడక విజయగణేష్, కోరుకొండ వెంకటరమణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

22న మహిళలకు ప్రత్యేక ఆయుర్వేద శిబిరం

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం యోగ కేంద్రం, ధాన్ ఆయుర్వేద రీసెర్చ్ డెవలప్‌మెంట్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన మహిళలకు ప్రత్యేక ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు యోగా కేంద్రం సంచాలకులు ఆచార్య కె.రమేష్ బాబు తెలిపారు. గర్భాశయ క్యాన్సర్ నివారించే విధంగా మహిళలకు అవసరమైన సూచనలు, ఆరోగ్య విధానాలను ఈ శిబిరంలో సూచిస్తారు. యోగా విలేజ్‌లోని ఈ క్లాస్‌రూమ్‌లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. ఈ శిబిరంలో ఉచితంగా రక్తంలో చక్కెరశాతం, సీరం కొలస్ట్రాల్, క్రియాటిన్ పరీక్షలు జరుపుతారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు డాక్టర్ నిషితను 7702682345 నంబరులో సంప్రదించాలని సూచించారు.

గంజాయితో ముగ్గురి అరెస్ట్

- 32 కిలోల గంజాయి స్వాధీనం
- నిందితులు అల్లూరి జిల్లాకు చెందిన వారిగా గుర్తింపు



పట్టుబడిన గంజాయితో డీఎస్పీ సత్యనారాయణ, సీఐ రమణ, ఎస్ఐ ధనుంజయ్

సబ్బవరం: మండలంలోని అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిపై అసకపల్లి ఫ్లై ఓవర్ వద్ద ఆటోలో తరలిస్తున్న 32 కిలోల గంజాయిని సబ్బవరం పోలీసులు పట్టుకున్నారు. సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో పరవాడ డీఎస్పీ సత్యనారాయణ మంగళవారం సీఐ పిన్నంటి రమణతో కలిసి వివరాలు వెల్లడించారు. సబ్బవరం ఎస్ఐ ధనుంజయ్‌కు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు ఆయన సిబ్బందితో కలసి జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహించి ఆటోలో తరలిస్తున్న 16 ప్యాకెట్లలోని 32 కిలోల గంజాయిని పట్టుకున్నారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకోని వారి నుంచి రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు.పట్టుబడిన గంజాయి విలువ రూ.1.60 లక్షల వరకూ ఉంటుందన్నారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడిన కిల్లోస్ గిరిబాబు, వంతల చంటి బాబు,వంతల కోటేశ్వరరావులను అదుపులోకి తీసుకోగా మరో వ్యక్తి పరారైనట్లు తెలిపారు. పట్టుబడిన వ్యక్తులంతా అల్లూరి జిల్లాలోని చింతపల్లి ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించామన్నారు. వీరు చింతపల్లి ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి నుంచి గంజాయి తీసుకుని సబ్బవరం మీదగా తుని తరలిస్తున్నట్లు తెలుస్తుందన్నారు. పట్టుబడిన వ్యక్తులను కోర్టులో ప్రవేశ పెడతామని ఈ సందర్భంగా డీఎస్పీ తెలిపారు.

రివార్డుల కోసం సిఫార్సు

ఏజెన్సీకి సబ్బవరం ప్రాంతం ముఖద్వారం గంజాయి రవాణాకు నిందితులు ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నారని డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. సీఐ పిన్నంటి రమణ,ఎస్ఐ ధనుంజయ్ గంజాయి అక్రమ రవాణాకు చెక్ పెట్టడంలో విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. వీరికి రివార్డుల కోసం ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. సమావేశంలో ఎస్ఐ ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

ఖాళీగా ఉండడంతో తప్పిన ముప్పు



ఫ్లాట్‌లో చెలరేగుతున్న మంటలు

పెందుర్తి: సుజాతనగర్ సమీపంలోని ఓ అపార్టమెంట్‌లో మంగళవారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. సుజాతనగర్ సమీపంలోని గొల్లవిల్లివానిపాలెం ప్రశాంతి అపార్ట్‌మెంట్‌లోని ఐదో(ఆఖరి) ఫ్లాట్ చాలా కాలంగా ఖాళీగా ఉంది. మంగళవారం సాయంత్రం ఫ్లాట్‌లో ఉన్న వాషింగ్ మెషిన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఫ్లాట్ మొత్తం మంటలు వ్యాపించాయి. దీంతో అపార్ట్‌మెంట్‌లోని మిగిలిన ఫ్లాట్లలో నివాసం ఉంటున్న వారు భయాందోళనతో బయటకు వచ్చేశారు. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. మర్రిపాలెం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే ఆ ఫ్లాట్‌లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

స్టీల్‌ప్లాంట్ విభాగాల్లో భద్రతా ర్యాలీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ విభాగాల్లో భద్రతా ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 28న స్టీల్ సేఫ్టీ డే సందర్భంగా ఉక్కు భద్రతా విభాగం ఆధ్వర్యంలో వివిధ అవగాహన కార్యక్రమాలు, పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఇంజినీరింగ్ షాప్స్ అండ్ ఫౌండ్రీ (ఈఎస్ఎఫ్), ఎల్ఎంఎం విభాగాల్లో ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఇంజినీరింగ్ షాప్స్‌లో జరిగిన కార్యక్రమంలో విభాగాధిపతి ఎస్.కె. పాండే, భద్రతా విభాగం డీజీఎం ఎం.వరప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు కార్మికులను కలిసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈఎస్ఎఫ్ అధికారులు జి.సి.బోస్, బి.ఆర్.జెనా, ఎస్.డి.నాయక్, భద్రతా అధికారి పి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

టెర్రస్ పైనుంచి పడి వ్యక్తి మృతి

పీఎంపాలెం: టెర్రస్‌పై నుంచి ప్రమాదవశాత్తు పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. మంగళవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పీఎంపాలెం సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. జీవీఎంసీ ఆరో వార్డులోని సేవానగర్‌లో బ్లాక్ నంబర్ 25 టీఎఫ్–3 లో కనక అనే మహిళ కుటుంబంతో నివసిస్తోంది. ఆమె వర్కింగ్ కాలేజీలో హౌస్ కీపింగ్ పనులు చేస్తుంది. ఆమె కుమారుడు రమేష్ (27)మద్యానికి బానిసై అనారోగ్యానికి గురవడంతో ఈ నెల 13న ఆస్పత్రిలో చేర్పించారు. 18వ తేదీన డిశ్చార్జ్ అయ్యారు. ఆస్పత్రి నుంచి వచ్చిన తరువాత మళ్లీ మద్యం తాగాడు. మంగళవారం ఉదయం 8.15 గంటల సమయంలో వారు నివసిస్తున్న ఇంటి టెర్రస్ మీదకు ఎక్కి ప్రమాద వశాత్తు కిందకు పడిపోయాడు. వెంటనే 108లో ఫోన్ చేశారు. వారొచ్చి పరీక్షించగా అప్పటికే మృతి చెందాడు. తాగిన మత్తులో టెర్రస్‌పైనుంచి పడిపోయి ఉంటాడని తల్లి కనక పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రామకృష్ణ తెలిపారు.

నేత్రపర్వంగా సహస్ర కలశాల శోభాయాత్ర



కలశాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు లక్ష్మీపురంలో దుర్గాలమ్మ, నూకాలమ్మ, పోలిపిల్లిమ్మ అమ్మవార్ల ఆలయ ప్రారంభోత్సవంలో భాగంగా మంగళవారం మహిళలు సహస్ర కలశాలతో శోభాయాత్ర నిర్వహించారు. దేవతా మూలమంత్ర హోమాలు, ధాన్యాధివాసం, నీరాజన మంత్ర పుష్పాలు, వేదస్వస్తి కార్యక్రమాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో, ప్రధాన అర్చకులు ఇరగవరపు వాసు శ్రీధర్ స్వాముల పర్యవేక్షణలో నిర్వహించారు. సాయంత్రం కోలాటాలు, తప్పెటగుళ్లతో అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. 20వ తేదీన యంత్ర, విగ్రహ, శిఖర ప్రతిష్ట, మహా పూర్ణాహుతి, సారె ఊరేగింపు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు అవిరెడ్డి సూర్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో కుచ్చర్లపాటి రామరాజు, సెక్రటరీ సిరసపల్లి బాబూరావు, అప్పికొండ పెంటారావు, బెల్లంకొండ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'ఉక్కు' రిలే దీక్షలు



రిలే దీక్షలో పాల్గొన్న నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. దీక్షల్లో 1132వ రోజు, మంగళవారం స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ఈఎస్ అండ్ ఎఫ్, ఈఆర్ఎస్, ఈఎండీ, సేఫ్టీ, టెక్‌సెల్, ఆగ్రో ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ విభాగాల కార్మికులు, సంస్థకు భూములిచ్చిన నిర్వాసితులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు కేంద్రప్రభుత్వం కట్టుబడి ఉండాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.